# పంజరంలో చిలక

## జి. రామకృష్ణారావు

పూర్వం ఇరాను దేశపు రాజధాని టెహరాను నగరంలో ఒక వ్యాపారి వుండేవాడు. అతని పేరు అబ్దుల్లా. వ్యాపారంలో మంచి చాకచక్యం వున్న వాడు. డబ్బు బాగా గడించాడు. శాంత స్వభావుడు. భూతదయగలవాడు. పక్షులంటే అమిత ప్రేమ. అందులోను చిలకలంటే ప్రాణం.

ముద్దులొలికే ఒక చిలకను పెంచుతున్నాడు. కన్న బిడ్డంటే తల్లి ఎంత శ్రద్ధ వహిస్తుందో అంతకంటె ఎక్కువ శ్రద్ధ వహిస్తున్నాడు ఆ చిలక విషయంలో. ఇంట్లో నౌకరూ చాకర్లూ వున్నప్పటికి అబ్దుల్లా తానే చిలకకు ఆహారం పెట్టాడు, నీళ్లు త్రాగిస్తాడు. చిలకకోసం అందమైన పంజరం చేయించాడు. చిలకకు అన్ని సదుపాయలూ ఆ పంజరంలో సమకూర్చాడు.

కొన్ని దినాలు గడిచాయి. మక్కా, మదీనా తీర్థయాత్ర చేయాలని నిర్ణయించుకున్నాడు. ప్రయాణానికి అన్ని హంగులు సిద్ధం చేసుకున్నాడు. అయితే తన చిలక విషయంలో పెద్ద సందిగ్ధావస్థలో పడ్డాడు. అరేబియా దేశంలో వేసవికాలంలో ఎండలు మెండు. ప్రయాణం కూడా అతి కష్టం. ఒంటెలమీద గుర్రాలమీద సాగుతుంది ప్రయాణమంతా. సుకుమారంగా బ్రతికే తన పెంపుడు చిలకను ఆ ఎండల్లో తీసుకుపోవటానికి మనస్కరించలేదు. చివరకు తానొక్కడే వెళ్ళేందుకు నిశ్చయించుకున్నాడు.

బయలుదేరేరోజు వచ్చింది తన ప్రయాణం గురించి చిలకకు చెప్పాలి

'ప్రియమైన చిలకా! ఈ మాటలు చెప్పటానికి నాకు నోరు రావటంలేదు. కాని చెప్పకతప్పదు. నేను ఇవ్వాళ తీర్థయాత్రకు బయలుదేరుతున్నాను. ఏర్పాట్లన్ని పూర్తయ్యాయి. అరేబియా దేశంలో కాచే ఎండలు సామాన్యమైన ఎండలుకావు. అతి కోమలమైన శరీరం ఆ వేడిని భరించలేదు. నేను కూడా నిన్ను వదిలి ఎక్కువ రోజులు వుండలేను. పుణ్య క్షేత్రాలు సందర్శించి త్వరలో తిరిగి వస్తాను. నీవు యిక్కడ సుఖంగా వుండేందుకు అన్నీ ఏర్పాట్లు చేశాను' అన్నాడు.

ఈ మాటలువిన్న చిలక తనమీద పిడుగు పడ్డట్టు భావించింది. ఏమీ తోచలేదు. 'స్వామీ! నన్ను మీ వశం చేసుకున్న నాటినుండి ఎంతో వాత్సల్యంతో పోషిస్తున్నారు, కంటికి రెప్పలాదిరి కాపాడుతున్నారు. మీరు లేకుండా, మిమ్మల్ని చూడకుండా యిక్కడ నేను వుండటం కష్టం. మీతోపాటే ఆ పవిత్ర క్షేత్రాలు కళ్లతో చూస్తా యీ పంజరంలోనుంచే. మీతోపాటేవర్షాతపాలుభరిస్తా, అనుభవిస్తా. పంజరంలో వుండే నాకు గ్రీష్మం, వసంతం, వర్షం యిత్యాది ఋతువుల భేదం ఏముంటుంది చెప్పండి! మీ ఎడబాటు సహించటం దుస్సాధ్యం. నన్ను కూడా మీ వెంట తీసుకువెళ్లండి స్వామీ!' అని ప్రార్థించింది.

అబులా కొంచెంసేపు యోచించాడు. 'నీకు తెలియదు. నామీద వుండే ప్రేమాతిశయంవల్ల అలా అనిపిస్తోంది నీకు. మన ఇరాను నుంచి అరేబియాకు వెళ్లటం తేలిక కాదు...అయితే నీకేమన్నా కోరిక వుంటే చెప్పు తప్పక తీర్చివెళ్తాను' అన్నాడు.

తనను వెంట తీసుకుపోడని చిలక గ్రహించింది. ఒక సందేశం పంపేదుకు నిర్ణయించింది. 'స్వామీ! మీరు ఇక్కడ్నుంచి అరేబియాకు పోయేదారిలో బాగ్దాదునగరం తగులుతుంది. ఆ నగరం సమీపంలో మీకు ఒక వనం కన్పడుతుంది. ప్రకృతి సౌందర్యం అంతా ఒకచోటే చేర్చారా అన్నంత శోభతో వుంటుం దావనం. అక్కడ నేక రకాల పక్షులు ఆనందోత్సాహాలతో కలకల స్వనంతో మధురగీతాలు గానం చేస్తుంటాయి. ఈ మధురగీతాలు. దూరానికే విని పిస్తాయి. అక్కడ మా బంధువులు, స్నేహబృందం వున్నారు. వారికి నా సందేశం ఒకటి అందివ్వండి. అదే నా కోరిక' అంది.

'ఇంతేనా. అదెంత పని. అదేమిటో చెప్పు. తప్పక అందిస్తా' అన్నాడు.

'వాళ్లతో ఇలా చెప్పండి—ప్రియమైన ఆప్తులారా! స్నేహితులారా! స్వేచ్ఛాజీవులు మీరు, స్వతంత్ర సమీరాలు పీల్చేవారు మీరు, నిరాటంకంగా గగనవీధుల్లో విహరించే భాగ్యవంతులు మీరు. నేను కూడా ఒకనాడు మీ తోటివాణ్నే. మీ మాదిరే జీవించాను, అనుభవించాను. ఇప్పుడు టెహరాను అనే నగరంలో వుంటున్నాను. లోహపు పంజరమే నా ప్రపంచం. ఇందులోనే జీవిస్తున్నాను. ఊహాపథంలో విహరిస్తున్నా. ఇక్కడుండే నా ప్రేయసినిగురించి సుఖస్వప్నాలు కంటున్నా, రేయింబవళ్లు తలపోస్తున్నా. గత్యంతరంలేదు. మీ ఈ ఆప్తుడు కోసం, భాగ్యవిహీనుడి కోసం బాధపడకండి. కాని ఒక్క మనవి. ఎప్పటికైనా స్వతంత్రజీవి కావాలని, ఆ భాగ్యం ప్రసాదించమని భగవంతుణ్ని వేడండి, ప్రార్థించండి' అంది చిలక కన్నీరు కార్చుతూ.

ఈ మాటలు విని అబ్దుల్లా ఆశ్చర్యపోయాడు. బయలుదేరవలసిన కాలం సమీపించింది. అందరి దగ్గర వీడ్కోలు స్వీకరించి తీర్థయాత్రకు పయనమయ్యాడు.

చిలక చెప్పినట్టు దారిలో బాగ్దాదునగరం తగిలింది. ఆ వనంకూడా కన్పించింది. అనేకరకాల పక్షులు కోలాహలంతో మధుర నినాదాలు చేస్తున్నాయి. వాటి సందడి వినగానే అబ్దుల్లాకు తన పెంపుడు చిలక మనసులో మెదిలింది. ఆ చిలక చెప్పిన సందేశం గుర్తుకొచ్చింది.

ఆవనం చేరుకున్నాడు. చిలకలున్న చెట్టును సమీపించాడు. ఈ ప్రయాణీకుణ్ని

### మనవి

గతవారం సంచిక మధ్యపుటలలో ఒరిస్సా ముగ్గులు, ఆముగ్గులపై వ్యాసము రచించినవారు శ్రీ గొల్లపల్లి వెంకటేశ్వరరావు అని గుర్తించ ప్రార్థన. అదేసంచిక 31—వ పేజీలో 'కాకరపూలు' చిత్రించినవారు శ్రీమతి ఎమ్. జి. కాంతమ్మ, ఆదోని; రథము చిత్రించినవారు కార్యంపూడి లక్ష్మీకాంతం అని కూడా గుర్తించ ప్రార్థన.

వచ్చేవారం నుంచి ★ డిటెక్టివ్ సీరియల్

# "అపరబుద్ధి"

## [సరికొత్త నవల]

డబ్బు పాపిష్టిది ! ఎంత పనైనా చేయిస్తుంది ! ఇందులో స్త్రీ పురుష విచక్షణతో పనిలేదు.

ఆమె పేరుకు మాత్రమే కోమలం. కాని, మనస్సు మాట? బుద్ధి పెడదార్లు పట్టింది. భీమా ఏజెంట్ కృష్ణమోహన్ తోడైనాడు.

ఇద్దరి బుద్ధులూ కలసి ద్విగుణీకృత శక్తితో పనిచేశాయి!

వారి పన్నాగం నెగ్గింది!

ఫలితం?

మీ కాపీ ముందే రిజర్వు చేసుకోండి!


# ★ పంజరంలో చిలక ★

చూసి ఆ చిలకలన్నీ ఆశ్చర్యపోయాయి. అన్నీ దగ్గరకొచ్చి గుమిగూడాయి.

అబ్దుల్లా 'ఓ మిత్రులారా! నాది బెహరానునగరం. తీర్థయాత్రకోసం మక్కా వెళ్తున్నా. మీ బంధువు, స్నేహితుడు నాదగ్గర వుంటున్నాడు. నే పెంచుతున్నా. అతని దగ్గర్నుంచి ఒక సందేశం తీసుకొచ్చా' అన్నాడు.

చిలకలన్నీ 'చెప్పండి, చెప్పండి' అన్నాయి. అతి సౌందర్యంగా వున్న ఒక చిలక మరీ ముందుకొచ్చింది రెక్కించి వింటానికని.

అబ్దుల్లా ఆ సందేశం వినిపించాడు.

ఇంకా సందేశం పూర్తిగా అవ్వనన్నా అవలేదు. ముందుకొచ్చిన చిలక 'ప్రియా! ప్రియా!' అంటూ అరిచి మూర్ఛపోయింది.

అబ్దుల్లా ఆశ్చర్యపోయాడు. మిగిలిన చిలకలన్నీ ఖంగారుపడ్డాయి. 'పుణ్యానికని బయలుదేరితే పాపం సంభవించిందేమిరా?' అనుకున్నాడు. ఎన్నో ఉపచర్యలు చేశాడు ఆ చిలకకు. కాని లాభం కన్పించలా. స్పృహ రాలేదు.

తిరిగి ఆ చిలకల్ని అడిగాడు గత్యంతరం ఏమిటని.

వయస్సులో పెద్దగా వున్న చిలక చెప్పింది: 'మీరు పెంచుతున్న చిలక యీ చిలకకు ప్రియుడు. మీ సందేశం విని మూర్ఛపోయింది ప్రేయసి. ప్రియుడువచ్చి పలకరిస్తేగాని స్పృహవచ్చేటట్లు లేదు. తక్షణం మీరు బెహరానువెళ్లి ఆ చిలకను తీసుకువస్తేతప్ప యీ చిలక జీవించదు.'

ఆలోచించాడు అబ్దుల్లా, పాప పుణ్యాలు. ఒకని చిలకను చేతులా చంపటమంత ఘోరపాపం వేరే వుండదనుకున్నాడు.

మరుక్షణమే వెనక్కి వెళ్లాడు. కరవేగంతో ప్రయాణం సాగించాడు.

పెద్ద చిలక సలహాప్రకారం తన పెంపుడు చిలకను వనంలోకి తీసుకొచ్చాడు.

తను అప్పుడు పంజరంలో వుండటం చూశాయి చిలకలు. కలకలం ఎక్కువయింది.

తన పెంపుడు చిలకను బయటకు వదిలాడు పంజరంలో నుంచి. రంయి మంటూ బయటకొచ్చింది. మూర్ఛలో వున్న చిలక దగ్గరకుపోయింది ఆత్రుతతో. మరీ దగ్గరగా వెళ్లి రుద్ధకంఠంతో 'ప్రియతమా! ప్రియతమా ఇదిగోవచ్చాను. లే! నీ కళ్ళలోని అందాన్ని చూడని నీ తీయని కంఠంతో నన్ను మనసారగా 'ప్రియా!' అనిపిలు. లేప్రియతమా! లే, లే ప్రియతమా!' అంది.

మూర్ఛపోయిన చిలక గాఢ నిద్రలోంచి మేల్కొన్నట్టు లేచింది. ఏదో మధుర స్వప్నం నిజమైనట్టు లేచింది. ఎదురుగా తన ప్రాణాధికమైన ప్రియుణ్ణి చూసింది. పరవశురాలైంది. 'ప్రియా! ప్రియా! ప్రియా!' అని ఆ పరవశంలో పిలిచి ప్రియుణ్ని నిలువెల్లా చూసి ఆనంద సాగరంలో తేలి ఆడింది. ప్రియుణ్ని ప్రేమాతిశయంతో చుంబించింది.

ఈదృశ్యం చూస్తున్న అబ్దుల్లాతోపాటు చిలకలుకూడా ఆనందాశ్రువులు రాల్చాయి. అందరికళ్ళూ సంతోషంతో మెరిశాయి. అబ్దుల్లా గుండె నిబ్బరపడింది.

తన పెంపుడు చిలకతో 'ప్రియమైనచిలకా! ఇకనీవు హాయిగా యిక్కడేవుండు. స్వేచ్ఛగా జీవించు. నీ ప్రేయసిని స్వీకరించు నాకు చక్కని పాఠం నేర్పావు. స్వతంత్రపిపాస ఎలావుంటుందో నాకు తెలిసివచ్చింది. ఇంక ఎప్పుడూ, ఎవర్నీ బందీగా వుంచను. ఇంతకాలం నా దగ్గర పంజరంలో వుండి ఎంతో బాధ అనుభవించావు. అంతా మర్చిపో. నేను నిశ్చింతగా మక్కా కు పోతాను. కాని నీమీదవుండే వాత్సల్యం ఆమరణాంతం వుంటుంది ఇవే నా ఆశీస్సులు' అన్నాడు.

ఆచిలక: 'స్వామీ! మీరుణం ఎన్నటికీ తీర్చుకోలేను. ఒక అస్వతంత్ర జీవికి స్వతంత్ర ప్రదానం చేశారు. మీ పుణ్యం అమోఘమయింది. అంతే కాదు. నాప్రేయసికి ప్రాణభిక్ష పెట్టారు. ఆజన్మాంతం మేం కృతజ్ఞులం. మీకు మేలు చేకూర్చాలని మేం ఎప్పుడు దైవాన్ని స్తుతిస్తూవుంటాం' అని చెప్పింది.

అబ్దుల్లా తన యాత్ర తిరిగి ప్రారంభించాడు అక్కణ్నుంచి.

ఆచిలుకలు రెండూ స్వేచ్ఛగా, మనసు తీరేట్లుగా, జంటగా ఆకాశంలోకి ఎగిరిపోయాయి. (హిందీ ఆధారంగా)